క్లుప్తంగా

వీరన్న సన్నిధిలో పూజలు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నామవరపు రామచందర్‌రావు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ఆయన పేరుతో పాటు కుటుంబసభ్యుల పేర్లపై గోత్రనామ అర్చనలు చేశారు. భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మండపంలో ఆయనను అర్చకులు శాలువతో సత్కరించారు. అనంతరం టీస్టాల్ ఎదుట చాయ్ పే చర్చ సందర్భంగా టీ తాగారు. గుడి ఎదుట వాహనంపై ఉన్న అతని మెడలో దేవీశంకర్ క్రేన్ సాయంతో గజమాల వేశారు.

బయ్యారంలో బీజేపీ నాయకుల స్వాగతం

బయ్యారం : భద్రాద్రి జిల్లా పర్యటన ముగించుకుని మహబూబాబాద్ జిల్లాలోకి ప్రవేశించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు మండలంలోని సత్యనారాయణపురం వద్ద ఆ పార్టీ నాయకులు స్వాగతం పలికారు.

ఎరువుల షాపుల తనిఖీ



కేసముద్రం : కేసముద్రం మున్సిపాలిటీ, ఇనుగుర్తి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను, ధన్నసరి పీఏసీఎస్‌కి చెందిన ఎరువుల గోదాంను, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయ శాఖ అధికారి అజ్మీరా శ్రీనివాసరావు బుధవారం తనిఖీ చేశారు. ధన్నసరి శివారులో పత్తి, వరి పంట క్షేత్రాలను ఆయన పరిశీలించి, రైతులకు సూచనలు చేశారు.ఏఓ వెంకన్న, ఏఈఓ రాజేందర్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ రూరల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఖాళీగా ఉన్న స్టెనో, టైపిస్టు ఉద్యోగాల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ బుధవారం తెలిపారు. ఆగస్టు 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. డిగ్రీ, షార్ట్ హ్యాండ్ హయ్యర్, టైప్ హయ్యర్ గ్రేడ్ అర్హతలు ఉండాలని, దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిన అనంతరం నియామక పరీక్ష తేదీ ప్రకటిస్తామని తెలిపారు. దరఖాస్తులను పోస్ట్, కొరియర్ ద్వారా మాత్రమే స్వీకరించబడునని, ఈ నియామకానికి సంబంధించిన పూర్తి వివరాలకు మహబూబాబాద్ జిల్లా కోర్టు ఆవరణలోని ఈ కోర్ట్స్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

వెల్లివిరిసిన అభిమానం



కురవి : అభిమానం కొత్తపుంతలు తొక్కుతోంది.. నారు మడిలో మాజీ సీఎం కేసీఆర్‌పై ప్రేమ, అభిమానంతో ఆయన పేరును బుధవారం తీర్చిదిద్దాడు ఓ యువరైతు. కురవి మండలం కంచర్లగూడెం గ్రామానికి చెందిన యువ రైతు బానోత్ రమేష్ తన పొలంలో నాటేసేందుకు సిద్ధమయ్యాడు. వరినారుతో మాజీ సీఎం కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో నారుతో 'కేసీఆర్' పేరు కనిపించేలా ఆకృతిని తయారు చేశాడు. దీంతో పొలంలో కేసీఆర్ పేరు పలువురిని ఆకట్టుకుంటుంది.

పింఛన్ కోసం పడిగాపులు



గూడూరు : వృద్ధాప్య పింఛన్ల కోసం వారం రోజులుగా లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. సిగ్నల్స్ సరిగా రావడం లేదనే కారణంతో కార్యాలయాలు కూడా సరిగా తెరవడం లేదని పింఛన్‌దారులు చెబుతున్నారు. బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సీతానగరం శివారు రెడ్డిపల్లె పోస్టాఫీసు వద్ద పదుల సంఖ్యలో వృద్ధులు పింఛన్ల కోసం వేచి చూశారు. ఈ విషయమై పోస్టు మాన్‌ను సంప్రదించగా స్పందించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతి నెల పింఛన్‌ను తమ బ్యాంకు ఖాతాలో పడేలా ఏర్పాట్లు చేయాలని పింఛన్‌దారులు కోరుతున్నారు.

బోనాల సందడి



దోర్నకల్ : దోర్నకల్‌లో బుధవారం పలువురు హిజ్రాలు ముత్యాలమ్మతల్లికి బోనాలు చెల్లించుకున్నారు. రైల్వే స్టేషన్ సెంటర్ నుంచి గాంధీసెంటర్‌లోని ముత్యాలమ్మతల్లి ఆలయం వరకు బోనాలతో ఊరేగింపు నిర్వహించిన తర్వాత అమ్మవారికి బోనాలు సమర్పించారు.

వంతెన నిర్మాణం ఎప్పుడో?

వెక్కిరిస్తున్న శిలాఫలకం

- వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



సీరోలు–పెద్దలాల్ తండా మధ్యలోని లోలెవల్ కల్వర్టు

కురవి : వానాకాలంలో భారీ వరదలు, వర్షాలకు లోలెవల్ వంతెనపై నుంచి నీరు పొంగి ప్రవహిస్తుంది. దీంతో ప్రతీ ఏటా వర్షాకాలంలో ప్రయాణికులకు, వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. గతేడాది కురిసిన భారీ వర్షాలకు వరదనీటితో లోలెవల్ వంతెనతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.. డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ సహకారంతో లో-లెవల్ వంతెన నిర్మాణానికి రూ.2కోట్ల నిధులు మంజూరు చేశారు. కాగా వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏడాది గడిచినప్పటికీ వంతెన నిర్మాణం ముందుకు సాగలేదు. దీంతో వంతెన నిర్మాణం వట్టిదేనా? అని ప్రజలు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. సీరోలు మండలం చింతపల్లి గ్రామ శివారు పెద్దలాల్ తండా గ్రామం నుంచి సీరోలుకు వెళ్లే ప్రధాన రహదారిలో మొండివాగు ఉంది. ఈ వాగుపై గతంలో లోలెవల్ కల్వర్టు ఏర్పాటు చేశారు. ప్రతీ ఏడాది వర్షాలకు వాగు పొంగిపోవడంతో కల్వర్టుపై ప్రయాణం ఇబ్బందిగా మారుతుంది. గతంలో సీరోలుకు వెళ్లేందుకు ప్రజలు నానా అవస్థలు పడేవారు. వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించి గతేడాది జూలై 6వ తేదీన శంకుస్థాపన చేశారు. ఏడాది దాటినా వంతెన నిర్మాణం జరగలేదు. వంతెన నిర్మాణం జరిగితే సీరోలు మండల కేంద్రానికి వెళ్లేందుకు సీరోలు, రేకుల తండా, జగ్యా తండా, కలెక్టర్ తండా, ఖమ్మం జిల్లాకు వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుత ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి వంతెన నిర్మాణానికి కృషి చేయాలని ప్రయాణికులు, ప్రజలు వేడుకుంటున్నారు.

వంతెన నిర్మాణం చేపట్టాలి



సీరోలు–పెద్దలాల్ తండా మధ్యలోని వాగుపై వంతెన నిర్మాణం మొదలు పెట్టాలి. వర్షాకాలంలో సీరోలు, ఖమ్మం జిల్లాకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి శిలాఫలకం వేశారు. వెంటనే అధికారులు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.

– భూక్య నరహరి, పెద్దలాల్ తండా

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కోరం కనకయ్య
- పాకాల ఏటి వద్ద ఎమ్మెల్యేను అడ్డుకున్న అఖిలపక్ష నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

గార్ల : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం మండలంలోని 19 పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోశారు. అనంతరం గార్లలోని ఓ ఫంక్షన్‌హాలులో కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, కొత్త రేషన్‌కార్డులను లబ్ధిదారులకు చెక్కులు, మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. మండలంలోని మద్దివంచ, రాంపురం పంచాయతీల్లో ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసి గార్లకు వస్తుండగా పాకాల ఏటి వద్ద అఖిలపక్ష నాయకులు చెక్‌డ్యాం పై బైఠాయించి పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణానిక నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇవ్వాలంటూ ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకొని నినాదాలు చేశారు. పోలీసులు అఖిలపక్షం నాయకులను నిలువరించారు. పాకాల ఏటిపై ఏడాదిలోగా బ్రిడ్జి నిర్మిస్తానని, లేనిచో బ్రిడ్జి కోసం మీతో కలిసి పోరాటాలు, ధర్నాలు చేస్తానని హామీ ఇవ్వడంతో అఖిలపక్షం నాయకులు ఆందోళన విరమించారు. పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, గుండా వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామారావు, ప్రవీణ్‌కుమార్, ఝాన్సీలక్ష్మి, ఎం.వెంకట్‌లాల్, ఏఎంసీ చైర్మన్ రాంబాబు, ఏఎంపీ డైరెక్టర్ బి.అశోక్, భూక్యా నాగేశ్వరరావు, తహసీల్దార్ శారద, ఎంపీడీఓ మంగమ్మ, సీఐ రవికుమార్, ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా పాల్గొన్నారు.

సరిపడా యూరియా ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

నెహ్రూసెంటర్ : వర్షాకాలంలో పంటలు సాగుచేసిన రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్ డిమాండ్ చేశారు. రైతులకు యూరియా సరఫరా చేయాలని జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వానాకాలం సీజన్ కొనసాగుతుందని, నారు పోసుకోవడం, నాట్లు వేసుకోవడం జరుగుతుందని రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా సాగునీటిని విడుదల చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు గునిగంటి రాజన్న, నల్లపు సుధాకర్, మార్తినేని పాపారావు, కందాల రమేష్, కోటయ్య, ఉపేందర్‌రెడ్డి, జలంధర్, జోగ్య నాయక్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

షాదీఖానాకు నిధులు మంజూరు చేయాలి



వేం నరేందర్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ముస్లింలు, ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని కంకరబోర్డులో శిథిలావస్థలో ఉన్న (ఉర్దూఘర్) పునఃనిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డికి బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ ఆధ్వర్యంలో ముస్లింలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్, షాదీఖానా అభివృద్ధి కమిటీ సభ్యులు అక్రమ్, ఫజల్ ఖాజా, జమీల్ బాబు, ఫిరోజ్, జాకీర్ మాట్లాడారు. మహబూబాబాద్‌లో 25 శాతం ముస్లిం, మైనారిటీలు నివసిస్తున్నారని, ఇందులో అత్యధికంగా నిరుపేదలున్నారని తెలిపారు. షాదీఖానాలో సరైన వసతులు లేకపోవడం వల్ల 25 సంవత్సరాల నుంచి ఎలాంటి శుభ కార్యాలు, ఇతర కార్యకలాపాలు నిర్వహణ జరగలేదని పేర్కొన్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఉర్దూ షాదిఖానా శిథిలావస్థకు చేరుకుందన్నారు. పాత నిర్మాణాన్ని పూర్తిగా తొలగించి కొత్త భవన నిర్మాణం చేపట్టడానికి నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలి

గూడూరు : మండల కేంద్రంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేసేందుకు సహకరించాలని సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడిదల సంజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాది అంబటి శ్రీనివాస్ కోరారు. హైదరాబాద్‌లోని వేం నరేందర్ రెడ్డి నివాసంలో బుధవారం వారు కోర్టు ఏర్పాటు విషయమై వివరించారు. కొత్తగూడ, గంగారం, గూడూరు మండలాలకు చెందిన కక్షి దారులు మానుకోటకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందుకు వేం నరేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, సీఎంతో మాట్లాడి వివరిస్తానని వారితో పేర్కొన్నారు.

నేరస్తులకు శిక్ష పడితేనే బాధితులకు న్యాయం

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



రూరల్ సీఐ సర్వయ్యను సన్మానిస్తున్న ఎస్పీ

మహబూబాబాద్ రూరల్ : నిందితులకు శిక్ష పడితేనే బాధితులకు న్యాయం జరుగుతుందని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. జిల్లాలోని కేసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలో గల కోరుకొండపల్లి గ్రామంలో జరిగిన హత్య కేసులో ముగ్గురు నేరస్తులకు జీవిత ఖైదు పడే విధంగా ప్రతిభ చూపిన సీఐ, ఏపీపీ, సీడీఓను బుధవారం ఎస్పీ సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. న్యాయం చేకూర్చే బాధ్యతను నిబద్ధతతో నిర్వహించిన పోలీసు, న్యాయ బృందం పనితీరు గర్వంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి కేసుల్లో మరింత సమర్థవంతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. రూరల్ సీఐ సర్వయ్య, కోర్టు డ్యూటీ ఆఫీసర్ (హెడ్ కానిస్టేబుల్) దేవ నాయక్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ గణేష్ ఆనంద్ ఉన్నారు.

శ్మశాన వాటిక నిర్మించాలి



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

మహబూబాబాద్ : నిజాం చెరువు వద్ద శ్మశాన వాటిక నిర్మించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, 27 వార్డు శాఖ కార్యదర్శి వెలుగు శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. శ్మశాన వాటిక స్థలం కబ్జాకు గురవుతుందని మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. నవీన్, వెంకన్న, అశోక్, ప్రవీణ్, దుర్గాప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



ధన్‌సింగ్ (ఫైల్)

కురవి : మండలంలోని లింగ్యా తండా గ్రామానికి చెందిన బానోత్ ధన్‌సింగ్(48) చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు కురవి ఏఎస్సై వెంకన్న బుధవారం తెలిపారు. ఈనెల 22న ధన్‌సింగ్ కూలీకి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో లింగ్యా తండా సమీపంలోని చేను వద్ద పాముకాటుకు గురయ్యాడు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో వేరే ఆస్పత్రికి తరలించేందుకు సిద్ధమవగా ధన్‌సింగ్ మృతి చెందినట్లు ఆయన వివరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య కాళీ, కుమార్తె కల్యాణి, కుమారుడు గణేష్ ఉన్నారు. ధన్‌సింగ్ మృతితో తండాలో విషాదం నెలకొంది.

కనీస వేతనాలు చెల్లించాలి

కురవి : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని నేరడలోని కేజీబీవీలో కరపత్రాలు ఆవిష్కరించారు. నేడు జిల్లా కేంద్రంలో కార్మిక ప్రదర్శన, ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బాలల అక్రమ రవాణాను అరికట్టాలి

మహబూబాబాద్ రూరల్ : బాలల అక్రమ రవాణా సామాజిక సమస్యగా మారిందని ఆర్పీఎఫ్ ఎస్సై సుభాని అన్నారు. ప్రపంచ చైల్డ్ ట్రాఫికింగ్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో షేర్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్పీఎఫ్ ఎస్సై సుభాని మాట్లాడుతూ.. బాలల అక్రమ రవాణా (చైల్డ్ ట్రాఫికింగ్) ను అరికట్టడంలో సమష్టి బాధ్యత అవసరమన్నారు. కార్యక్రమంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, ఎఫ్ఎంఎం సంస్థ, సఖి కేంద్రం సభ్యులు సుప్రజ, కౌన్సిలర్ శ్రీలత, హిమబిందు, ఉమామహేశ్వరి, రమేశ్, సమారా, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

పరస్పర దాడిలో పలువురికి గాయాలు

డోర్నకల్ : మండలంలోని గుర్రాలకుంట తండాలో ఇరు కుటుంబాల మధ్య పరస్పరం జరిగిన దాడిలో పలువురికి గాయాలైనట్లు డోర్నకల్ సీఐ బి.రాజేష్ బుధవారం తెలిపారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల అందజేత

గంగారం : పేదల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చిందని మాజీ జెడ్పీటీసీ ఈసం రమసురేష్ అన్నారు. మండలంలోని చింతగూడెంలో నలుగురి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా బుధవారం వారికి పత్రాలను అందించారు. ప్రతి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను అందించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల మంజూరు పత్రాలు..

చిన్నగూడూరు : మండలంలోని గుండంరాజుపల్లి, పగిడిపల్లి గ్రామాల్లో బుధవారం తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ యాకయ్య ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు రావుల రాంరెడ్డి, డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ కొత్త రేషన్‌కార్డుల పంపిణీ చేశారు. నాయకులు మురళీధర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు దాసరి రాజు, మాజీ సర్పంచ్ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నోట్‌బుక్స్..

గూడూరు : మండలంలోని పాటిమీదిగూడెం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు గోపీనాథ్ బుధవారం సొంత ఖర్చులతో విద్యార్థులలో చేతి రాత నైపుణ్యాన్ని పెంపొందించడానికి తెలుగు, ఇంగ్లిషు కాపీ రైటింగ్ నోటుబుక్స్‌లను అందజేశారు.. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల చేయూతను అభినందించారు.

విరాళం

నెల్లికుదురు : మండల కేంద్రంలోని రామలింగేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠాపనకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ రూ.50వేలు విరాళం ఇవ్వగా బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మదన్‌లాల్ బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందించినట్లు తెలిపారు. అనంతరం మహిళలు జలాభిషేకం నిర్వహించారు.

ఉద్యోగ విరమణ సహజం

మరిపెడ రూరల్ : ఉద్యోగికి విరమణ సహజమని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కీసర రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రాంపురం ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న గువ్వాడి లక్ష్మయ్యకు పదవీవిరమణ పొందగా ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. లక్ష్మయ్య దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు. సంఘం ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్‌గౌడ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గండి కరుణాకర్, హెచ్‌ఎం వెంకన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

సన్మానం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలో సీసీగా పనిచేసిన రూపాదేవి పదవీ విరమణ అభినందన, సన్మానం మహాలక్ష్మి మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం తిలక్, సరిత, విజయ, జయ, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు రుణం మంజూరు చేయాలి

మహబూబాబాద్ : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులైన డ్వాక్రా గ్రూపు మహిళలకు రూ.రెండు లక్షల రుణం మంజూరు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి డిమాండ్ చేశారు. సీపీఐ, భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ ఎదుట ధర్నా నిర్వహించి మెప్మా డీఎంసీ విజయకు వినతి పత్రం అందజేశారు.

హాస్టల్‌ను సందర్శించిన కమిషనర్

కేసముద్రం : మున్సిపాలిటీ పరిధి అమీనాపురంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల హాస్టల్‌ను మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి బుధవారం సందర్శించారు. మెనూ ప్రకారంగా భోజనం అందిస్తున్నారా, ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను ఆమె పరిశీలించారు.

షెడ్యూల్ విడుదల చేయాలి

నెల్లికుదురు : ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు అన్ని క్యాడర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇనుగుర్తి మండలంలోని చిన్నముప్పారం ఎంపీపీఎస్‌లో బుధవారం జరిగిన సబ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ 25ను సవరించి 40 మంది విద్యార్థులు ఉన్నచోట తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని అన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రేపు ఉద్యాన పంటలపై శిక్షణ

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని మల్యాల జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానంలో ఆగస్టు 1వ తేదీ (శుక్రవారం) షెడ్యూల్డ్ కులాల రైతులకు ఉద్యాన పంటలపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని జేవీఆర్ హెచ్ఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త కె.నాగరాజు బుధవారం తెలిపారు. శిక్షణ అనంతరం రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు పంపిణీ చేస్తామన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

బయ్యారం : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 1వ తేదీన కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం బయ్యారంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించి ఎంఈఓ దేవేంద్రాచారికి అందజేశారు.

'నిధుల గోల్‌మాల్'



మాట్లాడుతున్న అధ్యక్షుడు నరేష్

మరిపెడ రూరల్ : జిల్లా ఫొటోగ్రఫీ సంఘంలో రూ.14 లక్షల నిధులు గోల్‌మాల్ అయినట్లు మరిపెడ ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు జాటోత్ నరేష్ తెలిపారు. బుధవారం మండలంలో ఫొటోగ్రాఫర్ల సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ జిల్లా సంఘంలో శాశ్వత సభ్యత్వం కింద జమ చేసిన డబ్బులు మొత్తం రూ.20 లక్షల నిధులు ఉండగా, ఇందులో రూ.14 లక్షలను పాత కమిటీ అధ్యక్షుడు అవకతవకలకు పాల్పడ్డట్లు బాధ్యతలు చేపట్టిన నూతన కమిటీ గుర్తించడం జరిగిందన్నారు. మరిపెడ నుంచి నిధులు జమచేసుకున్న 40 మంది శాశ్వత సభ్యత్వం కలిగిన సభ్యులు ఉన్నారని ఆయన వాపోయారు. ఫొటోగ్రాఫర్ల నిధుల అవినీతికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాల్సిందిగా జిల్లా నూతన కమిటీ బాధ్యులను నరేష్ వేడుకున్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- డిప్యూటీ స్పీకర్ డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిప్యూటీ స్పీకర్ రామచంద్రు నాయక్

దంతాలపల్లి : హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులపై ఉపాధ్యాయులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిప్యూటీ స్పీకర్ డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర గురుకులాన్ని బుధవారం సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మండలంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి తగు సలహాలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎంపీడీఓ విజయ, బట్టు నాయక్, ఎంపీఓ అప్సర్ పాష పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

రైతులు ఆధునిక పద్ధతులు పాటించి వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్ అన్నారు. మండలంలోని ఆగపేట గ్రామంలో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రోన్ సాయంతో మందులు పిచికారీ చేయాలన్నారు. సేంద్రియ పద్ధతిలో పంటలు పండే విధంగా కృషి చేయాలని కోరారు. భారతీయ కిసాన్ సంఘం జాతీయ అధ్యక్షుడు సాయిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస రావు, వరహాముఖి రాష్ట్ర సొసైటీ జైపాల్ రెడ్డి, ఎరోస్పేస్ నబీల్ హాష్మీ, ఏఓ, ఏఈఓలు, రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి కృషి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



తొర్రూరు రూరల్: మడిపల్లి చెరువులో మరమ్మతు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

తొర్రూరు రూరల్/పెద్దవంగర : నియోజక వర్గంలోని చెరువులను అభివృద్ధి చేస్తామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తెలిపారు. మండలంలోని మడిపల్లి గ్రామ శివారులోని ఉప్పరవాని కుంట చెరువు మరమ్మతు పనులను, అలాగే పెద్ద వంగర మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలో కాల్వ పూడిక తీత పనులను టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డితో కలిసి బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. చెరువుకు గండ్లు పడిన నేపథ్యంలో స్థానికుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే సొంత ఖర్చులతో మరమ్మతు చేసేందుకు హామీ ఇచ్చారు. ప్రతిపక్షాలు ఎం పాదయాత్రలు చేసిన రైతులకు మేలు చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు, యూత్ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



మాట్లాడుతున్న రెడ్యానాయక్

డోర్నకల్ : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ విమర్శించారు.బుధవారం డోర్నకల్‌లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓ ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో రెడ్యానాయక్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలన అన్ని రంగాల్లో విఫలం కావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించలేక అధికార పార్టీ చేతులెత్తేసిందన్నారు. డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ ఉద్దేశపూర్వకంగా బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. డోర్నకల్ ఎమ్మెల్యేపై సూర్యాపేటలో భూకబ్జా కేసులు నమోదయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షంరెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రావు, పాండునాయక్, వెంకటరెడ్డి, మధు, యశోధర్, కొత్త వీరన్న తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు అడ్డుకున్న వారిపై కేసు

మహబూబాబాద్ రూరల్ : అనుమతి లేకుండా ఆస్పత్రి ఎదుట ధర్నా చేసి అత్యవసర వైద్యసేవలను అడ్డుకున్న వారిపై కేసు నమోదు చేశామని మహబూబాబాద్ టౌన్ ఇన్‌చార్జ్ సీఐ పి.సర్వయ్య బుధవారం రాత్రి తెలిపారు. మహబూబాబాద్ పట్టణ పరిధిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి ఈ నెల 27వ తేదీన సీరోలు మండలంలోని బోడతండాకు చెందిన బోడ పద్మ డెలివరీ నిమిత్తం వచ్చిందన్నారు. ఆమెకు చికిత్స అందిస్తున్న క్రమంలో హైబీపీ వల్ల చనిపోయిందన్నారు. ఈ విషయాన్ని అదునుగా తీసుకుని బోడ రమేష్, మంగీలాల్, భీమా నాయక్, హుస్సేన్, కొంతమంది కలిసి ఆస్పత్రి గేటు ఎదుట ధర్నా చేపట్టారు. రూ.50 లక్షలు డిమాండ్ చేసి బలవంతంగా కాగితం రాయించి లక్ష రూపాయలు తీసుకున్నారన్నారు. అత్యవసర వైద్య సేవలను అడ్డుకున్న వారిపై కేసు నమోదు చేయాలని ఆస్పత్రి వైద్యుడు ఇచ్చిన ఫిర్యాదుతో వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. అనుమతి లేకుండా ధర్నాలకు పాల్పడిన, వైద్య సేవలకు అంతరాయం కల్పించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.